

## నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

**ప్రజాశక్తి-రాయచోటి**

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

### మున్సిపల్ యూనియన్
# జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-రాయచోటి అర్బన్**

ఈనెల 26న రాయచోటిలో నిర్వహించే ఎపి మున్సి పల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అబ్బవరం రామాంజులు, జిల్లా అధ్యక్ష కార్య దర్శులు బి.వి.రమణ, పివి రమణలు పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.వి రమణ అధ్యర్యంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రామాంజులు మాట్లాడుతూ మున్సి పల్ కార్మికులకు 12వ పిఆర్సి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.32000 ఇవ్వాలని, ఆప్కాస్ రద్దు యోచనను విరమించుకోవాలని కోరారు. ఊరు శుభ్రతకు పాటుపడే కార్మికులకు సామాజిక భద్రతను కల్పించి రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం, పెన్షన్, గ్రాట్యుటీలను ఇచ్చి భరోసా కల్పించాలన్నారు. మున్సిపల్ జనాభాకు తగ్గట్టు కార్మికులను నియమించి పనిభారం తగ్గించి ప్రజారోగ్య పరిరక్షణకు పాటుపడాలని పేర్కొన్నారు. ఈనెల 26న నిర్వహించే మహాసభలో అనేక తీర్మానాలు చేసి భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేపట్టడం ద్వారా సమస్యలు పరిష్కారం చేస్తామన్నారు. మహాసభలకు జిల్లాలోని మున్సిపల్ కార్మికులందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ ఉపాధ్య క్షులు చెన్నయ్య, రామకృష్ణ, కార్యదర్శి శివ కుమార్ తో పాటు జిల్లాలోని మదనపల్లి, రాయచోటి, రాజంపేట, బి .కొత్తకోట మున్సిపాలిటీలకు చెందిన నేతలు శ్రీరాములు, శ్రీనాథ్, వెంకటేష్, ఏడుకొండలు , రెడ్డయ్య, గోపాల్, వెంకటయ్య గంగయ్య పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు రామాంజులు

# ఫ్యాప్టో ధర్నాతో ప్రభుత్వం కళ్లు తెరిపిద్దాం




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరహారెడ్డి

**ప్రజాశక్తి - రాయచోటి అర్బన్**

ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్న కూటమి ప్రభుత్వానికి ఫ్యాప్టో ధర్నాతో కళ్ళు తెరిపిద్దామని ఎస్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. రాయచోటిలోని డైట్ కళాశాలలో జిల్లా అధ్యక్షులు ఏ.శివారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ 12వ పిఆర్సి గడువు దాటి ఏడాదిన్నర అవుతున్నా కమిటీ ఏర్పాటు వైపుగా కూటమి ప్రభుత్వం చర్యలు లేవన్నారు. తక్షణం 12వ పిఆర్సి ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టి, వెంటనే 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అను గుణంగా పెంచాల్సిన డిఎలు సైతం అమలుకు నోచుకోవడం లేదని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన ఆరు మాసాలలోగా ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలన్నిటినీ చెల్లిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. తక్షణం పెండింగ్ డిఎలతోపాటు వేలకోట్ల బకాయిలు చెల్లింపులకు రూట్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల పాలిట ఉరితా డులా పరిణమించిన సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే విషయంలో కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తి నట్లు వ్యవహరిస్తుందని. విమర్శించారు. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి విద్యాశాఖలో నెలకొని ఉన్న అసంబ ద్ధాలను తొలగించాలని, కోర్టుల జోక్యం కారణంగా నిలిచిపోయిన 72,73, 74 జీవోలను అమలు చేసేలా చర్యలు చేపట్టా లని వారు కోరారు. గురుకులాలు సొసైటీలలో పని చేస్తున్న వారికి విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. పై సమస్యల పరిష్కారం కోసం ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ఈనెల 7న విజయవాడలో జరగబోయే ధర్నాలో ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.మధుసూదన, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# మదనపల్లె జిల్లా హామీ ఏమైంది?

**ప్రజాశక్తి-పీలేరు**

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఆరునెలల్లోనే మదనపల్లె జిల్లా ఏర్పాటు చేసి, ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ బాబుల హామీ ఏమైందని మదనపల్లి జిల్లా సాధన సమితి సూటిగా ప్రశ్నించింది. ఆదివారం పీలేరు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో విడుదలై చిరుతైగల్ కట్చి పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన మదనపల్లె జిల్లా సాధన సమితి రౌండ్ టేబుల్ సమావేశానికి మదనపల్లె జిల్లా సాధన సమితి కన్వీనర్ పిటిఎం శివప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 కావస్తున్నా మదనపల్లె జిల్లా ఎందుకు ప్రకటించలేదన్నారు. ఈనెల 26న చలో మదనపల్లె పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, సమావేశంలో విసికె రాష్ట్ర కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు, రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సి. చంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ షరీఫ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీకాంత్, సిపిఐ నియోజవర్గ కార్యదర్శి టి.యల్ వెంకటేష్, మహాజన సోషలిస్టు పార్టీ నాయకుడు ఎన్. సుధాకర్ బాబు, మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణికుమార్, ఎపిఎంఆర్పిఎస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కన్వీనర్ ముల్లంగి చంద్రయ్య, ఎస్సి, ఎస్టి, సంఘ నాయకుడు లక్ష్మీనారాయణ, గిరిజన యానాది సేవా సంఘం జిల్లా నాయకులు కిల్లా విజయ్ కుమార్‌పాల్గొన్నారు.


**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

మదనపల్లె జిల్లా ఏర్పాటులో టిడిపి కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోందని, మదనపల్లె జిల్లా ఏర్పాటు పైన అధికారిక ప్రకటన చేయడానికి ఇంక ఎన్ని సంవత్సరాలు ఎదురు చూడాలని జెఎసి నాయకులు ప్రశ్నించారు. మదనపల్లె జిల్లా సాధన కోసం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో మదనపల్లె జిల్లా జెఎసి మలిదశ పోరాట రౌండ్ టేబుల్ సమావేశం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి మాల మహానాడు అధ్యక్షులు యమలా సుదర్శనం, బిసి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బోడెం రాజశేఖర్‌యాదవ్, సిపిఐ మురళి, సిపిఎం ప్రభాకర్‌రెడ్డి, విసికె సభ్యులు పీరూ, కాంగ్రెస్ పార్టీ మైనా రిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్‌కె.బాషా, మీనా కుమారి, ముబారక్ ఖాన్, మాల మహానాడు నాయకులు గుండాల మనోహర్, మల్లెల మోహన్, రామాంజులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె, పుంగనూరు, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాలను కలిపి వెంటనే జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయ కులు మహబూబ్ పీర్, శరత్ కుమార్ రెడ్డి, రవీంద్ర, పాలేటి, మహబూబ్ బాషా, భాను ప్రకాష్ రెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మదనపల్లి జిల్లా సాధన సమితి పిలుపు మేరకు మదనపల్లి జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాలలో జరుగుతున్న రౌండ్ టేబుల్ సమావేశాల్లో భాగంగా తంబళ్లపల్లె నియోజకవర్గపు సమావేశం సిపిఐ ఆధ్వర్యంలో పట్టణంలోని బెంగళూరు రోడ్డులో గల షాదీ మహల్ లో సిపిఐ నియోజకవర్గపు కార్యదర్శి ఎస్.మనోహర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.కృష్ణప్ప, విసికె పార్టీ రాష్ట్ర నాయకులు కె.వి.రమణ, కావడి రవీంద్ర, తెలుగుదేశం పార్టీ నాయకులు, సోషల్ వర్కర్ కనకంటి చంద్రమోహన్, జనసేన పార్టీ యువనాయకులు రెడ్డి మోహన, బాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నరసింహులు, కార్యదర్శి సింగన్న,సిపిఐ(ఎం)నాయకులు వెంకటాచలపతి, గిరిజన నాయకులు కాంతారావు పాల్గొన్నారు.

## ముదివేడు పోలీసుస్టేషన్‌లో ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలోని ముదివేడు పోలీసుస్టేషన్‌ను ఆదివారం ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, సిడి ఫైళ్లు, ఎంట్రీలు సక్రమంగా నమోదు చేస్తూ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పిఆర్‌ఆర్‌ఎస్ ద్వారా వచ్చే పిటిషన్లను త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. స్టేషన్ భూమిని సర్వే చేయించి, చుట్టూ కంచె వేయాలని ఆదేశించారు. స్టేషన్ ముందు ఉన్న ఖాళీ స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు కొరకు పరిశీలించారు. సిబ్బంది ప్రతీ ఒక్కరితో మాట్లాడి ఆరోగ్యం, కుటుంబ పరిస్థితులను తెలుసుకున్నారు. విధుల్లో నిబద్ధతగా పనిచేయాలని సూచించారు. రాబోయే పంచాయతీ ఎన్నికల దృష్ట్యా గ్రామాలలో విజిబుల్ పోలీసింగ్ పెంచాలని, ట్రబుల్ మాంగర్లు గుర్తించి మండల రెవెన్యూ కార్యాలయంలో బైండోవర్ చేయాలని సూచించారు. ప్రతి మంగళవారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. డయల్ 112 ఫోన్ కాల్స్ ఆలస్యం లేకుండా వెంటనే అటెండ్ చేయాలని ఆదేశించారు. రాత్రివేళల్లో గస్తీ పెంచి, మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ముదివేడు పరిధిలో రోడ్డు ప్రమాదాలు అధికంగా నమోదవుతు న్నందున డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, ఓపెన్ డ్రింకింగ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు త్వరగా దర్యాప్తు పూర్తి చేసి, చార్జిషీట్ వేయాలని ఆదేశించారు. అంగళ్లు చుట్టుపక్కల సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, పీజీ హాస్టల్స్‌లో ఆకస్మిక తనిఖీలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ దిలీప్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి

## ఎన్‌సిసిలో 'మిట్స్' విద్యార్థికి రజత పతకం

**ప్రజాశక్తి-మదనపల్లె**



పతకం సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న యువరాజ్

మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటి విద్యార్థి, ఎన్‌సిసి క్యాడెట్ కె.ఇసాక్ ఎనోష్ జాతీయ స్థాయి పోటీలో రజత పతకం సాధించాడని ఉప కులపతి డాక్టర్ యువ రాజ్ తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా థాల్ సైనిక్ క్యాంప్ 2025లో 'జడ్జింగ్ డిస్టెన్స్ అండ్ ఫీల్డ్ సిగ్నల్స్ విభాగంలో ప్రతిభ కనబరిచి ఈ ఘనత అందుకున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్-తెలంగాణ ఉమ్మడి డైరెక్టరేట్ తరపున 91 మంది క్యాడెట్లు పాల్గొని అద్భుత ప్రదర్శన చేయగా, వారిలో మిట్స్ విద్యార్థి ఒకరైందుకు గర్వంగా ఉందని ఆయన అన్నారు. వరుసగా 11 క్యాంపుల్లో శిక్షణ పొంది ఈ విజయాన్ని సాధించిన ఇసాక్ ఎనోష్‌ను, తల్లిదండ్రులు జెర్మియా, ఎస్తేర్ రాణితో పాటు యూనివర్సిటీ కుటుంబం అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా యూని వర్సిటీ ఫౌండర్, చాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్‌చౌదరి, ప్రో-చాన్సలర్ ఎన్.ద్వారకానాథ్ నాయుడు, ప్రిన్సిపల్ డాక్టర్ పి. రామనాథన్, ఎన్‌సిసి లెఫ్టినెంట్ డాక్టర్ నవీన్ కుమార్, 35 ఆంధ్ర బెటాలి యన్ చిత్తూరు కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ మోనిష్. అడ్మినిస్టేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పి.లోకనాథన్, తిరుపతి గ్రూప్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సత్యేంద్ర దయా అభినందించారు.

## పీలేరుకు ఆరు స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాలు

**ప్రజాశక్తి-పీలేరు :** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛఆంధ్ర రాష్ట్ర, జిల్లాస్థాయి పురస్కారాల్లో పీలేరు నియోజకవర్గానికి ఆరు జిల్లా స్థాయి పురస్కారాలు దక్కాయి. ఆదివారం వెలువడిన ప్రభుత్వ ప్రకటనలో పీలేరు ఏరియా 100 పడకల ఆసుపత్రికి స్వచ్ఛ ప్రాంతీయ ఆసుపత్రి పురస్కారం లభించింది. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు స్వచ్ఛ పాఠశాల పురస్కారం, స్థానిక కామాటంవారిపల్లి అంగన్వాడీ కేంద్రానికి స్వచ్ఛ అంగన్వాడి కేంద్రం పురస్కారం, స్వచ్ఛ గ్రామ నిర్వహణ పురస్కారానికి పీలేరు మండలంలోని ముడుపులవేముల, వాల్మీకిపురం మండలంలోని అయ్యవారిపల్లి ఎంపికయ్యాయి. అదేవిధంగా స్వచ్ఛ గ్రామపంచాయతీ పురస్కారానికి గుర్రంకొండ మండలం, గుర్రంకొండ గ్రామపంచాయతీ ఎంపికైంది. ప్రభుత్వం ప్రకటించిన ఈ పురస్కారాలను సోమవారం రాయచోటిలోని జరిగే కార్యక్రమంలో కలెక్టర్ చేతులు మీదుగా పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

# ప్రొద్దుటూరులో దారుణం

- తల్లిని అతిదారుణంగా చంపిన కసాయి కొడుకు
- గొంతుకోసి.. ఆపై టీవీ చూస్తూ రాక్షసానందం!



కొడుకు చేతిలో దారుణ హత్యకు గురైన లక్ష్మీదేవి



లక్ష్మీదేవి(ఫైల్)

**ప్రజాశక్తి-ప్రొద్దుటూరు**

ప్రొద్దుటూరులో దారుణం చోటు చేసుకుంది. కన్నతల్లినే కుమారుడు గొంతుకోసి దారుణంగా చంపాడు. తల్లి ప్రాణం తీసిన అనంతరం ఎలాంటి బాధ, బెరుకు లేకుండా ఇంట్లో కూర్చుని తన సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ రాక్షసానందం పొందాడు. ఈ సంఘటన ప్రొద్దుటూరులోని శ్రీరామ్ నగర్‌లో చోటు చేసుకుంది.

పోలీసుల వివరాల ప్రకారం.. విజయ్‌భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవి దంపతులు శ్రీరామ్‌నగరలో నివాసముంటున్నారు. వీరికి యశ్వతంకుమార్‌రెడ్డి అనే కుమారుడు ఉన్నాడు. లక్ష్మీదేవి పట్టణంలోని ఈశ్వర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. యశ్వంత్ మూడేళ్ల కిందట చెన్నైలో బిటెక్ పూర్తి చేశాడు. ఉద్యోగాన్వేషణ కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఖర్చుల కోసం ప్రతి నెలా అతని తల్లి డబ్బులు పంపేవారు. ఇటీవల తల్లికి ఫోన్ చేసి రూ.3 అడిగితే పంపారు. మరో సారి రూ.10 వేలు కావాలని అడిగాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో తల్లిపై కోపం పెంచుకున్నాడు. కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఆదివారం ఉద యం హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరులోని ఇంటికి వచ్చాడు. వచ్చీ రా గానే తల్లితో గొడవకు దిగి దాడిచేశాడు. ఆమె గట్టిగా అరవడంతో ఆ కేకలు విని బెడ్‌రూమ్‌లో ఉన్న తండ్రి విజయ్‌భాస్కర్‌రెడ్డి బయటకు వచ్చే ప్రయత్నం చేయగా ఆయన్ను లోపలికి నెట్టేసి గదికి గడియపెట్టాడు. ఆ తరువాత కూరగాయల కత్తితో వెనుక నుంచి తల్లిగొంతు కోశాడు. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న తల్లిని ఈడ్చుకుంటూ బయట పడేశాడు. ఆపై తలుపులు వేసుకుని ఇంట్లో దర్జాగా టీవీ చూస్తూ సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ రాక్షసానందం పొందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. నిందితుడుని అందుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం లక్ష్మిదేవి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

# పశువుల పెంపకంతో అధిక దిగుబడులు

### జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కె.గుణశేఖర్‌పిళ్లై



ముఖా ముఖి..

**ప్రజాశక్తి - రాయచోటి**

జిల్లాలో రైతులు ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, నాటు కోళ్ల పెంపకం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కె .గుణశేఖర్‌పిళ్లై పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో పశు సమర్థ శాఖ కార్యాలయాలు, సిబ్బంది, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పాడి పెంపకం, వ్యాధులను ఎలా నివారించాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

**జిల్లావ్యాప్తంగా పశుసంవర్ధక శాఖ కార్యాలయాలు, సిబ్బంది వివరాలు తెలపండి?**

జిల్లావ్యాప్తంగా ఆరు నియోజకవర్గాలలో 30 మండలాల్లో మూడు డివిజన్‌లలో రాయచోటి మదనపల్లె, రాజంపేట ప్రాంతాలలో ఉప సంచాలకులున్నారు. మూడు డివిజన్లో 18 మంది సహాయ సంచాలకులు (ఎడిలు), పశువైద్యాధి కారులు 72 మంది, గ్రామీణ పశువైద్యా ధికారులు 63 మంది ఉన్నారు. 226 రైతు సేవా కేంద్రాలలో పశువైద్య సహాయకులు, 116 మంది గోపాల మిత్రలున్నారు.

**ఆవులు, గేదెలు వివరాలు తెలపండి?**

జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,24,325 ఆవులు, గేదలున్నాయి. ఇందులో 1,00, 588 గేదలు, 2,76,417 ఆవులు , గొర్రెలు, మేకలు మొత్తం 2,77,695 ఉన్నాయి. ఇందులో 13,24,325 గొర్రెలు, 3,53,370 ఉన్నాయి. 23,82,260 కోళ్లు, మదనపల్లె, పీలేరు, కలికిరి ప్రాంతాలలో కోళ్ల పారాలు ఎక్కువగా ఉన్నాయి .

**పశువులకు ప్రస్తుతం ఎలాంటి వ్యాధులు సంభవిస్తున్నాయి?**

పశువులకు ప్రస్తుతం గాలి కుంట వ్యాధి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటివరకు గాలికుంటు వ్యాధులు జిల్లాలో ఎక్కడ నమోదు కాలేదు. ఈ వ్యాధిని నివారించడానికి ముందస్తు టీకాలు వేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 2,87,050 డోసులు మంజూరయ్యాయి. ఇప్పటివరకు 2,02,238 డోసులు 70.5 శాతం టీకాలు వేశాం. రాష్ట్రంలో తృతీయ స్థానంలో అన్నమయ్య జిల్లా ఉంది. ఈనెల చివరి వరకు మిగిలిన రోజులు వేసి 100 శాతం వేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పశు శాఖ సిబ్బంది బృందాలుగా ఏర్పడి రైత ఇంట వద్ద ఉదయం 6 నుండి 9 గంటల వరకు టీకాలు వేసి కార్యాలయానికి తమ సిబ్బంది హాజరవుతున్నారు. ఈ టీకాల అమల తీరును సహాయ సహసంచాలకులు, ఉపసంచాలకులు, సంయుక్త సంచాలకులు తనిఖీ చేసి ఈ వ్యాధిపై రైతులకు అవ గాహన కల్పిస్తూ సలహాలు సూచనలను ఇస్తున్నాం.

**జిల్లాలో శిథిలా వస్థకు చేరిన పశుసంవర్ధక శాఖ కార్యాలయాలు ఎన్ని ఉన్నాయి ?**

జిల్లా వ్యాప్తంగా మొత్తం 70 పశుసంవర్ధశాఖ భవనాలు ఉన్నాయి. 13 భవనాలను వరకు శిథిలావస్థకు చేరాయి. వాటి వివరాలు ఉన్నతాధికారులకు ప్రతి పాదించడం జరిగింది. మొదటి దఫాగా 4 భవనాలకు నిధులు మంజూరయ్యాయి.

**పశుగ్రాసం కొరత నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?**

ప్రస్తుతం జిల్లాలో 75 శాతం రాయితీతో అధిక పశు గ్రా సోత్పత్తి విత్తనాలు 262 టన్నులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. అన్ని పశువైద్యలయాల్లో, రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయి. సాగునీటి సౌకర్యం ఉన్న రైతులు ఆధార కార్డు జిరాక్స్ తీసుకొని పొందవచ్చును. ఈ విత్తనాలను పశుగ్రాసం పండించి, ఎండబెట్టి గడ్డివాములుగా నిలువ ఉంచి రాబోయే వేసవిలో పశుగ్రాసం కొరతను అధిగమించ్చవచ్చు.

**రైతులకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలి అనుకుంటున్నారా?**

ప్రస్తుతం తక్కువ ఖర్చుతో ఆదాయం పొందాలంటే అనుకూలమైంది నాటు కోళ్ల పెంపకం. ఈ పెంపకం చేపట్టేటప్పుడు కొక్కెర తెగలు నివారణ టీకాలు వేయించి జబ్బులు నుండి కాపాడుకోవచ్చు. దీనివల్ల కోళ్ల మరణాలను తగ్గించవచ్చు. జిల్లాలో పాల ఉత్పత్తి పెంచుటకు డిఆర్‌డిఎ వారి నిర్వహించే గ్రామ సభలో పాల్గొని డ్వాక్రా మహిళలు పాడి ఆవులు యూనిట్ ఎంపిక చేసుకోవచ్చు. ఈ యూనిట్ మంజూరు ద్వారా పాడి పశువుల సంఖ్య పెరిగి జిల్లాలో పాల ఉత్పత్తిని పెంచుకోవచ్చు. యదకు వచ్చిన పశు వులను లింగ నిర్ధారిత వీర్యనాళికలను వాడకం ద్వారా 90 శాతం పేయి దూడలను పొందే అవకాశం ఉంది. ఈ పేయదూడలు పెరిగి 2,3 సంవత్సరాలు పాడి పశువులగా మారి పాల ఉత్పత్తిని అధికంగా పొందవచ్చును. ఈ యద సూదిలకు రాయితీ పోను రూ.150 చెల్లించాలి.

### కల్తీ మద్యం వ్యాపారం
## టిడిపి తీవ్రంగా పరిగణిస్తోంది

**ప్రజాశక్తి-మదనపల్లి :** తంబళ్లపల్లి నియోజక వర్గం మొలకలచెరువు కల్తీ మద్యం వ్యాపారం సంచలనం కలిగించిందని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ అన్నారు. ఆదివారం స్థానిక నిమ్మనపల్లి సర్కిల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి అక్రమ కల్తీ మద్యం తయారీని తీవ్రంగా పరిగనిస్తుందన్నారు. గత వైసిపి పాలన లోనే అధికంగా కల్తీ మద్యం కేసులు నమోదు కావడంతో పాటు, కల్తీ మద్యం తాగి మృతి చెందారన్నారు. తంబళ్లపల్లి నియోజక వర్గంలో కల్తీ మద్యం తయారీలో పార్టీ ఇన్‌ఛార్జి ప్రమేయం లేదని తెలిపారు. ఇప్పటికే అక్రమ మద్యం తయారీ కేసులో నిందింతులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. మిగిలిన వారిని త్వరలోనే అరెస్టు చేస్తారని చెప్పారు. వైసిపి నుంచి టిడిపిలో చేరిన వారే పద్ధతులు మార్చు కోవడం లేదని, అలాంటి వారే ఇలాంటి అక్రమాలకు తెరతీసి, పార్టీకి చెడ్డ పేరు తీసుకు వస్తున్నారని ఆరోపించారు. గతంలో జరిగిన అక్రమ మద్యం కేసులో అన్ని దార్లు మాజీ ముఖ్య మంత్రి వైపే చూపు తున్నాయని విమర్శించారు. తంబళ్లపల్లి ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి పిఎ రాజేష్ రెడ్డి పిటియం మండలం వైసిపి ఎంపిటిసి చెన్న కేశవ రెడ్డి కుమా రుడన్నారు. ఎక్కడైన తప్పు జరిగితే నైతిక బాధ్యత గా క్రమ శిక్షణ చర్యలు తీసుకునే పార్టీ టిడిపి అన్నారు. తెలుగు దేశం పార్టీ అధికారం లో ఉంది కాబట్టే ఇలాంటి నేరాలను వెలుగు లోకి తీసుకు రావడం జరిగిందని, ఎట్టి పరిస్థితుల్లోను అక్రమ కార్య క్రమాలను స్పష్టం చేశారు.కార్యక్రమంలో రాచ వేటి వారిపల్లె గ్రామకమిటీ అధ్యక్షుడు మల్లికార్జున, టీఎన్‌ఎస్‌ఎఫ్ గండికోట గణేష్‌బాబు, నాదెండ్ల జగదీష్, రామచంద్ర నాయుడు, రామాం జులు, వట్టికొండ రెడ్డెప్ప,వేణు గోపాల్, విద్యాసాగర్, కంచపు రెడ్డెప్ప పాల్గొన్నారు.

## అన్నదాతలను నట్టేట ముంచిన కూటమి సర్కార్

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ :** రాష్ట్రంలోన కూటమి ప్రభుత్వం అన్నదాతలను నట్టేట ముంచిందని, రాజధాని అమరావతి టమోటా రైతులకు చేసింది శూన్యమని ఎపి రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కిసాన్ సెల్ చైర్మన్ కామన ప్రభాకరరావు ధ్వజమెత్తారు. ఆదివారం మదనపల్లెకు వచ్చిన ఆయన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ సింగం రామకృ ష్ణారెడ్డి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం కదిరి రోడ్డులోని జోయస్ హోటల్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు రెడ్డి నిగార్ సుల్తాన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభాకరరావు మాట్లాడుతూ దేశంలో టమోటా రాజధానిగా గుర్తింపు పొందిన మదనపల్లె టమోటా మార్కెట్ యార్డ్ లో రైతులు మూడంచెల దోపిడీకి గురవుతున్నారు. మార్కెట్ లో రైతులకు గిట్టుబాటు ధరలు దక్కలేదని, దళారుల దోపిడీ యథేచ్ఛగాసాగుతోందన్నారు. దీనిపై మార్కెట్ కమిటీ కార్యదర్శి, జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు, ప్రేక్షక పాత్రకే పరిమితం కావడం పై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక క్రేట్ టొమోటోలను పండించాలంటే రైతుకు రూ.900 ఖర్చవుతుంటే రూ.300 మాత్రమే దక్కుతోందన్నారు.

## నీటి గుంటలో పడి ఇద్దరు విద్యార్థులు మృతి

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**



మృఇచెందిన చిన్నారులు

ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన సంఘటన సంబెపల్లి మండల పరిధిలోని నడిం రాజుగారిపల్లె గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెలితే.. నడింపల్లి గ్రామా నికి చెందిన మల్లుగూరి అంకిత్ (11), మద నపల్లి పట్టణానికి చెందిన పైడి మోక్షిత్ (13) బంధువుల పిల్లలు కావడంతో ఆదివారం మధ్యాహ్నం దళితవాడ దగ్గర ఉన్న నల్లరాళ్లవడ్డీ కుంట వద్ద ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందారు.. విద్యార్థులను గమనించిన గ్రామస్తులు కుంట నుండి తీసి మోక్షిత్ కొన ఊపిరి ఉండడంతో చికిత్స కోసం ద్విచక్ర వాహనంలో రాయచోటికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు కుటుంబ సభ్యులు అటు నుంచి స్వగ్రామమైన మదనపల్లికు తరలించారు. సమాచారం అందుకున్న సంబేపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వాల్మీకి జయంతి వేడుకలను బహిష్కరిస్తున్నాం

**ప్రజాశక్తి-రాయచోటి**

వాల్మీకుల పట్ల, వాల్మీకుల జాతి పట్ల కూటమి ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య ధోరణికి, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోవడానికీ తీవ్ర నిరసనగా, మహర్షి వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 7న నిర్వహించబోయే మహర్షి వాల్మీకి జయంతి రాష్ట్ర స్థాయి వేడుకలను బహిష్క రించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు జిల్లా మహర్షి వాల్మీకి బోయసంఘం ప్రధాన కార్యదర్శి బాలే రెడ్డి దిలీప్ జోషి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంఘం నిర్ణయం ప్రకారం, ఈసారి మహర్షి వాల్మీకి జయంతిని వాల్మీకులే తమ పల్లెల్లో, తమ వీధుల్లో, తమ ఇండ్లల్లో సొంత ఆధ్వర్యంలో స్వగౌరవంతో, ఆత్మాభిమానంతో జరుపుకోవాలన్నారు.వాల్మీకులు రాష్ట్రవ్యాప్తంగా ఈ బహిష్కరణ కార్యక్రమాన్ని కింది అంశాలపై నిరసనగా చేపడు తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వాల్మీకి బోయల గిరిజన రిజర్వేషన్ల అంశంలో చేసిన మోసానికి నిరసనగా వాల్మీకి కార్పొరేషన్‌కు నేటి వరకు ఏ విధమైన నిధులు మంజూరు చేయకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ నిరసనలో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను వాల్మీకులు సమగ్రంగా బహిష్కరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.



ఉద్ధృతంగా ప్రవహిస్తున్న గుంజనేరు

## గుంజనేరులో ప్రవహిస్తున్న వర్షపునీరు

**ప్రజాశక్తి- రైల్వేకోడూరు**

మండలంలోని సూరపరాజుపల్లె గ్రామానికి వెళ్లే మార్గంలో రైల్వే వంతెన కింద గుంజనేరులో వర్షపు నీరు ప్రవహిస్తోంది. శనివారం తిరుపతి, తిరుమలలో కురిసిన భారీ వర్షానికి గుంజన ఏటిలో నేటి ప్రవాహం ఆ ప్రాంత వాసులకు ఆహ్లాదం కలిగిస్తోంది. మొన్నటి వరకు చుక్క నీరు లేక ఎండిపోయిన ఏటికి నీటి ప్రవాహం రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు ఆ ఏటిలో వాహనాలను వర్షపు నీటితో కడిగి శుభ్రం చేసుకుంటూ ఉంటారు. పిల్లలు,పెద్దలు ఎండ వేడికి సేద తీరేందుకు జలపాతంలా ఉన్న ఆ ప్రాంతంలో ఉల్లాసంగా గడిపారు.

## ఎమ్మెల్సీ దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు

**ప్రజాశక్తి-పుల్లంపేట**



ఎమ్మెల్సీతో మాట్లాడుతున్న సర్దాజ్ హుస్సేన్

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు కూడా టెట్ పరీక్ష ఉత్తీర్ణులు వ్వాల్సిందేనని సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేసేలా కృషి చేయాలని పశ్చిమ రాయ లసీమ పట్టభద్ర ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగో పాల్‌రెడ్డిని కోరినట్లు మండల ఎస్‌టియు అధ్యక్షుడు సయ్యద్ సర్దాజ్ హుస్సేన్ తెలిపారు. ఆదివారం ఎమ్మెల్సీని కలిసి తమ సమస్యలను విన్నవించినట్లు తెలిపారు. విన్న వించారు. దీనిపై ఆయన స్పందిస్తూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు మేలు కలిగేలా ముందుకు వెళుతుందని తెలిపారని చెప్పారు. ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక బకాయిలు కూడా దీపావళి నాటికి పూర్తవుతుందని ఎమ్మెల్సీ చెప్పారని సర్దాజ్ తెలిపారు.



మంత్రి సవితతో మాట్లాడుతున్న లక్ష్మీప్రసన్న

## మంత్రి సవితను కలిసిన లక్ష్మీ ప్రసన్న

**ప్రజాశక్తి- కలకడ**

రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రిశాఖ మంత్రి సవిత, ఎంపీ పార్థసారధిని పీలేరు నియోజకవర్గ సర్పంచ్ సంఘం అధ్యక్షురాలు కోటకొండ లక్ష్మీ ప్రసన్న కమలనాథ మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఆదివారం తిరుపతిలోని బస్టాండ్ సమీపంలో కనకదాసు విగ్రహప్రతిష్టాపనలో పాల్గొన డానికి వచ్చిన సవితను కలసి సర్పంచుల స్థితిగతుల గురించి వివరించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో చేనేత కార్మికులు అధికంగా ఉన్నారని, వారి అభివృద్ధి కోసం కృషి చేయాలని తెలిపామన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కదిరాయచెరువు బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ కమలనాథ,ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారని తెలిపారు.

## నేడు నిమ్మనపల్లి మండల సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి**

మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఎంపిపి డి.నరసింహులు అధ్యక్షతన నిర్వహి స్తున్నట్లు ఎంపిడిఒ రమేష్‌బాబు తెలిపారు. మండల మీటింగ్ స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఉదయం 11గంటలకు నిర్వహించబడునని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటిసిలు, కో-ఆప్షన్ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను తీసుకురావాలని తెలిపారు.

## వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి

**ప్రజాశక్తి - నందలూరు**



మాట్లాడుతున్న సూర్యనారాయణ

వ్యక్తిగత విమర్శలు మానుకొని పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లా డుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కూడా నందలూరు మండలంలో వైసిపి పాలనే కొనసాగుతోందన్నారు. పంచాయితీ అభివృద్ధికి తాను ఎప్పుడు వ్యతిరేకిని కాదని, అయినా కూడా కొంతమంది తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఈమధ్య జరిగిన మండల సమావేశంలో ఒక ఎంపిటిసి నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీలోని అభివృద్ధి పనులకు పంచాయతీ తీర్మానం ఇవ్వడం లేదని తనపై నింద మోపడం సరికాదన్నారు. తనపై ఆరోపణ చేస్తున్న వ్యక్తి ఏరోజైనా పంచాయితీ తీర్మాన విషయం తనతో గాని , పంచాయితీ కార్యదర్శి గాని అడిగారా అని ఆయన ప్రశ్నించారు. అదే ఎంపిటిసి గత వైసిపి ప్రభుత్వంలో, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పంచాయితీ అనుమతులు లేకుండా పనులు చేయలేదా అని అన్నారు. అదే పనుల కోసం బిల్లుల విషయంలో తనపై, పంచాయితీ కార్యదర్శిపై అధికారంతో ఒత్తిడి చేయించలేదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం పంచాయితీ అనుమతులు లేకుండా పనులు చేసే బిల్లులు రావని తెలుసుకొని, తాము పంచాయితీ అనుమతులు కోరామని , అనుమతి ఇవ్వలేదని తనపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ముఖ్యంగా తాను వైసిపిని వీడి టిడిపి పార్టీలో చేరడంతో తనపై కక్ష సాధింపు చర్యలు చేపట్టారని ఆరోపించారు. ఇప్పటికైనా వ్యక్తిగత విమర్శలు వీడి పంచాయితీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## ధాన్యం ధరలో కదలిక..అమ్మకాలకు రైతులు సిద్ధం

**ప్రజాశక్తి - చాపాడు**

గత ఖరీఫ్‌లో సాగు చేసిన వరి ధాన్యం ధరలు గత వారం వరకు దయనీయంగా ఉన్నాయి. నెల తరబడి నిలకడగా ఉన్న ధరలో కాస్త కదలిక కనపడుతుంది. పుట్టి (8 బస్తాలు)వరి ధాన్యం ధర రూ.14వేల నుంచి రూ.16 వేల వరకు చేరుకున్నాయి. డిసెంబర్ నెలలో వరి నూర్పిడి పనులు చేపట్టిన సమయంలో పుట్టి ధర రూ.12 వేల వరకు పలికాయి. ఆ తర్వాత జనవరి నుంచి రూ.13 వేలకు ధరలు చేరుకున్నాయి. గత నెల వరకు అవే ధరలు కొనసాగుతూ స్థిరంగా ఉన్నాయి. మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 15 వేల ఎకరాల్లో వరి సాగును రైతులు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా కేసీ కెనాల్, కుందూ, పెన్నా, మైలవరం తెలుగుగంగ ద్యాంల పరిధిలో 1,50,000 ఎకరాలకుపైగా వరి పంటను రైతులు సాగు చేపట్టారు. గతంలో ఆగస్టు, సెప్టెంబర్ నాటికి వరి ధాన్యం ధర రూ.18వేల వరకు పలికేవి. ఈ ఏడాది రూ.16వేలు మాత్రమే పలుకుతుండటంతో వరి ధాన్యాన్ని నిల్వ ఉంచి తీవ్రంగా నష్టపోతున్నామని కొంతమంది రైతులు అమ్మకాలకు సిద్ధపడుతున్నారు.

# ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

### రూ.30 లక్షలు విలువైన బంగారు నగలు స్వాధీనం : డిఎస్‌పి

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

జిల్లా కేంద్రం రాయచోటి ప్రాంతంలో వరుస దొంగతనాలకు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి సుమారు రూ.30 లక్షల 80 వేలు విలువగల 310 గ్రాములు బంగారు, 150 గ్రాములు వెండి ఆభరణాలతో పాటు ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రాయచోటి డిఎస్‌పి కృష్ణమోహన్ తెలిపారు.ఆదివారం రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అయన మాట్లాడుతూ కడప కు చెందిన షేక్ నౌమాస్ అలియాస్ మస్తాన్, హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ షా అలీ జబ్రి అలియాస్ సోహెల్ అనే ఇద్దరు దొంగలు కడప కేంద్రంగా ఎంచుకొని కడప, అన్నమయ్య జిల్లాలలో వరుస దొంగతనాలకు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడేవారన్నారు. పట్టుబడ్డ నిందితులలో కడప కు చెందిన షేక్ నౌమాస్ అలియాస్ మస్తాన్ పై కడప, అన్నమయ్య జిల్లాలలో 9 కేసులు ఉండగా, హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ షాఅలీ జబ్రి అలియాస్ సోహెల్ పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తోపాటు ఇతర రాష్ట్రాలలో 175 చోరీ కేసులు ఉన్నాయన్నారు. పట్టుబడ్డ ఇద్దరు నిందితులు పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు బంధువుల ఇళ్లకు వెళ్లేటప్పుడు తమ ఇంటిని భద్రపరచుకోవాలని ప్రతి ఒక్కరూ ఇసి కెమెరాలు ఏర్పాటు చేసుకొని ఉండాలన్నారు. బంగారం అమాంతం రేట్లు పెరగడం వల్ల దొంగలు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారని మహిళలు బయటకి వెళ్ళేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. దొంగలను పట్టుకోవడంలో కృషిచేసిన రాయచోటి అర్బన్ సిఐ చలపతి, ఎస్ఐ బాలకృష్ణ అబ్దుల్ జహీర్, సిసిఎస్ఐ రామకృష్ణ, కానిస్టేబుల్ అమర్నాథ్, బాబ్జి, రామకృష్ణ, సురేంద్ర, సిపిఎస్ సిబ్బంది బర్కత్, మహేంద్ర డిఎస్‌పి ప్రత్యేకించి అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న రాయచోటి డిఎస్‌పి కృష్ణమోహన్

# ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



రాజంపేట :ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

**ప్రజాశక్తి-రాయచోటి**

సుదీర్ఘ కాలం పాటు ఉపాధ్యాయులుగా విద్యారంగానికి సేవలందించిన ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్‌టియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని డైట్‌లో ఆదివారం ఉదయం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన, ఇటీవల పదవి విరమణ పొందిన ఉపాధ్యాయుల ఆత్మీయ అభినందన సన్మానసభను ఎస్‌టియు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఎస్ టి యు జిల్లా అధ్యక్షుడు ఏ. శివారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కత్తి నరసింహారెడ్డి, మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ భావి భారతావనికి ఉత్తమ పౌరులను అందించే ఉపాధ్యాయులు దీపపు స్తంభాలాంటి వారన్నారు. తదనంతరం రాయచోటి రీజన్లో పదవీ విరమణ చెందిన, జాతీయ రాష్ట్ర అవార్డు పొందిన దాదాపు 65 మంది ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. వారు చేసిన సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కే సుబ్రహ్మణ్యం, ఉప విద్యాశాఖ అధికారి నాగయ్య, డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి , డీసీఈబీ సెక్రటరీ నాగముని రెడ్డి , హెచ్ఎమ్ అసోసియేషన్ నాయకులు రామకృష్ణ, సంఘ రాష్ట్ర అసోసియేటెడ్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యంరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలగంగారెడ్డి, కడియాల మురళి, ఆదినారాయణ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, సీనియర్ నాయకులు వై రవీంద్రనాథ్ రెడ్డి, వివిధ మండలాల మండల విద్యాశాఖ అధికారులు, ఎస్టీయు రాష్ట్ర కౌన్సిలర్ బి మురళి కుమార్, జిల్లా మైనారిటీ కన్వీనర్ బాషా, రీజినల్ కన్వీనర్ వెంకటేశ్వర రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **రాజంపేట :** ఉపాధ్యాయులు సమాజానికి దిక్సూచి అని జనసేన పార్లమెంట్ కో–ఆర్డినేటర్ అతికారికృష్ణ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిఎంసి కల్యాణమండపంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, పెనగలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె తదితర మండలాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న అతికారి కృష్ణ మాట్లాడుతూ గురువుల దిశా నిర్దేశంతో విద్యార్థులు జ్ఞాన సముపార్జన చేసి ప్రపంచ మేధావులుగా ఎదిగేందుకు గురువులు దోహదపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బాలరాజు, ప్రతినిధులు డాక్టర్ నవీన్ చంద్ర, గీతాంజలి రమణ, సయ్యద్ నాసరుద్దీన్, కొండూరు విజయ్ కుమార్ రాజు, గుల్జార్‌బాషా, విశ్రాంత తహశీల్దార్ రమణ, రంగరాజు నరసింహారాజు, సంగరాజు రామచంద్ర రాజు, పెనిగలపాటి చంద్ర, డాక్టర్ సుధాకర్, పారా సుబ్బానాయుడు, ఆర్ఐ కుమారస్వామి పాల్గొన్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయుడిగా రమణ

**పుల్లంపేట :**అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని రాజంపేట లయన్స్‌క్లబ్ వారు నిర్వహించిన వేడుకల్లో దలవాయిపల్లి ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రమణకు డివిజన్ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత రమణ మాట్లాడుతూ ఇలాంటి అవార్డ్స్ ఇవ్వడం పట్ల తన ఉపాధ్యాయ స్థాయిని ఒక మెట్టు పెంచడమే కాక బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఒత్తిడి లేని నాణ్యమైన విలువలు కలిగిన విద్యను అందించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేయడమే తన ఆకాంక్షని పేర్కొన్నారు.



సన్మానం అందుకుంటున్న ఉపాధ్యాయుడు రమణ

# విచ్చలవిడిగా నకిలీ మద్యం: వైసిపి



రాజంపేట : మాట్లాడుతున్న విశ్వనాథరెడ్డి

**ప్రజాశక్తి-రాజంపేట**

కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో విచ్చలవిధిగా నారావారి నకిలీ మద్యం ఏరులై పారుతోందని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి ఆరోపించారు. ఆదివారం వైసిపి కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో గ్రామాల్లోకి మద్యం పోవాలంటే భయపడే ప్రసక్తి ఉండేదని, ఇప్పుడు గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఏ బ్రాండ్ మద్యం కావాలన్నా హోమ్ డెలివరీ చేస్తున్నారని విమర్శించారు. నకిలీ మద్యంతో వేలకోట్లు దోచుకుంటున్నారని, గ్రామాలలో నీళ్ల ప్యాకెట్, పాల ప్యాకెట్లు దొరికినంత సులభంగా నకిలీ మద్యం లభిస్తోందన్నారు. 18 నెలల కూటమి ప్రభుత్వంలో అరాచకం రాజ్యమేలుతోందన్నారు. ఇసుక, మట్టి విచ్చలవిడిగా దోచుకుంటున్నారని, కల్తీ మద్యం తయారు చేసి వేలకోట్ల రూపా యలు దోచుకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా గ్రామాలలో నకిలీ మద్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ముస్లిం మైనారిటీ కన్వీనర్ ఖాజాముద్దీన్, ఆర్‌టిఐ అధ్యక్షుడు సుబ్బరాజు, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు గంగాకల్యాణ్, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

### కల్తీ మద్యం తయారీలో నిజాలు నిగ్గుతేల్చాలి

**బి.కొత్తకోట :**ములకచెరువులో లిక్కర్ మాఫీయాలో నిజాలు నిగ్గు తేల్చాలని, నిజమైన దొంగలను అరెస్టు చేసి కోర్టులో,స్టేషనులో అమాయకులను కాకుండా,తెరవెనుక ఉన్నా బడాబాబులను పట్టుకొని అరెస్టు చేసి శిక్షించాలని వైసిపి బి.కొత్తకోట పట్టణ కన్వీనర్ సి.ఆర్.చిన్నికృష్ణ డిమాండ్ చేశారు.గత వైసిపి ప్రభుత్వంలో లిక్కర్‌పై ఎన్నికల ప్రచారాలలో సెటైర్లు వేసిన కూటమి డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, మద్యం ప్రియుల ఆరోగ్యంపై బిజెపి కేంద్ర నాయకురాలు పురంధేశ్వరి, బాటిల్‌పై సిఎం చంద్రబాబు మాట్లాడారని అన్నారు. ఇప్పుడు అదేకూటమి నాయకుల ప్రభుత్వంలో పేదల ప్రాణాలతో చెలగాటం ఆడినా,ఆడుతున్న అసలైన నేరస్తులను, కొన్ని వేలకోట్ల డబ్బు సంపాదించారన్నారు. ఆర్థికంగా రాష్ట్రానికి నష్టం కలిగించారన్నారు. మద్యం మాఫీయాలో పాల్గొన్న వారందరినీ శిక్షించాలన్నారు. ఈ లిక్కర్ స్కాంలో తంబళ్లపల్లి టిడిపి ఇన్‌చార్జి, ఇతర టిడిపి ప్రముఖుల ప్రమేయం ఉన్నట్లు ఆయన అనుమానం వ్యక్తం చేశారు.వెంటనే ఈ విషయంపై సమగ్ర దర్యాప్తు జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని పోలీసుశాఖను కోరారు.

# కోనమ్మ చెరువు కాలువకు మరమ్మతులు

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మండల పరిధిలోని కొత్తపేట గ్రామపంచాయతీకి చెందిన కోనమ్మ చెరువుకు నీరు సరిగా రాక ఇబ్బందులు పడుతున్న తరుణంలో గ్రామస్తులు రైల్వే కోడూరు టిడిపి ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా అందుకు ఆయన చొరవ తీసుకొని వెంటనే పనులు ప్రారంభించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఆదివారం రూపానంద రెడ్డి తనయుడు ముక్కా సాయివికాస్‌రెడ్డిచే భూమిపూజ చేశారు. కొత్తపేట గ్రామపంచాయతీ ప్రజలందరూ హర్షాన్ని వ్యక్తం చేస్తూ రూపానంద రెడ్డికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. 40 ఏళ్లుగా కోనమ్మ చెరువు కాలువ మరమ్మతు పనుల కోసం ఎదురు చూస్తున్నామని ఇన్నాళ్లకు తమ కల నెరవేరిందన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్‌నాయుడు, సుధాకర్ నాయుడు,ఈశ్వరనాయుడు, చిన్నం శివయ్య, రామచంద్రయ్యనాయుడు, కృష్ణమనాయుడు, లింగుట్ల వెంకటరమణ నాయుడు కేశినేని నారాయణనాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



కోనమ్మచెరువు కాలువ మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న సాయివికాస్‌రెడ్డి



నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయం ఉద్యోగులు

## సచివాలయ ఉద్యోగుల డిమాండ్లు తీర్చాలి

**ప్రజాశక్తి - జమ్మలమడుగు**

సచివాలయ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్స్ తీర్చాలని జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చిన్న మస్తాన్ డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆదివారం జమ్మలమడుగు డిఎల్‌డిఓ కార్యాలయం ఎదుట నిరసన ర్యాలీ, వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న మస్తాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మణ్, జిల్లా కన్వీనర్ మస్తాన్, జమ్మలమడుగు డివిజన్ కన్వీనర్ రాజారెడ్డి మాట్లాడుతూ వాలంటరీ విధులు ప్రస్తుతం ఉద్యోగులకు చాలా ఇబ్బందిగా ఉందన్నారు. వెంటనే వాలంటరీ విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కొంతమంది అధికారుల వేధింపుల నుంచి రక్షించడానికి ప్రత్యేక చట్టం తేవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులందరినీ మాతృశాఖలో విలీనం చేసి సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్‌తో కూడిన వేతనాన్ని ఇవ్వాలని వేడుకున్నారు. నోషనల్ ఇంక్రిమెంట్స్‌ను తక్షణమే విడుదల చేయాలన్నారు. తమ న్యాయమైన డిమాం డ్లపై ప్రభుత్వం స్పందించి వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మైలవరం, పెద్దముడియం, ముద్దనూరు మండలాల యూనియన్ అధ్యక్షులు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

## మదర్ థెరిస్సా వృద్ధాశ్రమంలో అన్నదానం

**ప్రజాశక్తి - వేంపల్లె**

స్థానిక పాత గండి రోడ్డులో ఉన్న మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నదానం చేపట్టారు. చింతలమడుగుపల్లె గ్రామానికి చెందిన సింగారెడ్డి వీరమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు ధర్మారెడ్డి వృద్ధులకు అన్నదానం చేశారు. స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. తన తల్లి జ్ఞాపకార్థం ప్రతి ఏడాది అనాథలకు అన్నదానం చేయడం సంతృప్తిగా ఉందని ధర్మారెడ్డి తెలిపారు. ఆశ్రమ అభివృద్ధికి తమ వంతు చేయూతను అందిస్తామని దాత పేర్కొన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఓబులమ్మ, సార్థక్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రూప, ధర్మారెడ్డి, సౌజన్య, చేతవ్, సింహారెడ్డి, మౌక్తికారెడ్డి పాల్గొన్నారు.



సిఐ చలపతికి ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

## మంత్రిపై అసత్య ఆరోపణలు తగవు

### - చర్యలు తీసుకోవాలని పట్టణ సిఐకు టిడిపి నేతల వినతి

**ప్రజాశక్తి రాయచోటి అర్బన్**

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాయచోటి పట్టణ టిడిపి అధ్యక్షుడు బోనమల ఖాదరవలీ, రాయచోటి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు అల్లంపల్లి రాంప్రసాద్ రెడ్డి పట్టణ సిఐ బి.వి.చలపతికి ఫిర్యాదు చేశారు. ఈ నెల 4న సోషల్ మడియాలో గుర్తుతెలియని మంత్రిపై తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. మద్యం కల్తీ కేసులో మంత్రికి అంశాలు అనుసంధానిస్తూ తప్పుడు వీడియోలు కూడా ప్రచారం చేయడం జరిగిదన్నారు. వెంటనే సదరు వ్యక్తుల పై చర్యలు తీసుకో వాలన్నారు. సోషల్ మీడియాలో నిరాహార ప్రచారాలను నియంత్రించాలని వారు తిరిగి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చలపతి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఖాదర్‌బాషా, నేతలు సుగవాసి పాలకొండ్రాయుడు మహమ్మద్ ,మస్తాన్ పాల్గొన్నారు



సిఎం, డిప్యూటీ సిఎం, ఎమ్మెల్యే చిత్ర పటాలకు పాలాభిషేకం చేస్తున్న ఆటోడ్రైవర్లు

## సిఎంకు రుణపడి ఉంటాం

**ప్రజాశక్తి- కలకడ**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే నల్లారికిషోర్ కుమార్ రెడ్డిలకు ఎప్పటికీ రుణపడి ఉంటామని మండల కేంద్రమైన కలకడ ఆటో డ్రైవర్లు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కలకడ బస్టాండ్ సమీపంలో సిఎం, డిప్యూటీ సిఎం, ఎమ్మెల్యే చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఇబ్బందులకు గురవుతున్నట్లు గుర్తించిన సిఎం చంద్రబాబు ఆటో డ్రైవర్లకు కొద్దో ,గొప్పో సహాయం చేయాలని ఉద్దేశంతో సొంత ఆటోలు కలిగి ఉండి రికార్డులు లైసెన్సులు కలిగి ఉన్న వారికి ఏడాదికి రూ. 15వేలు ఇవ్వడం సంతోషకరమన్నారు. ఈ ఆర్థిక సాయం ఆటో డ్రైవర్ల కుటుంబాలకు కొంత ఊరట కలిగిస్తుందన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్ ముబారక్ అలీ, టౌన్ ఇన్‌ఛార్జి జిలానిబాషా, బూత్ కమిటీ కన్వీనర్లు జాఫర్ హుస్సేన్, ఖాజా హుస్సేన్, తెదేపా యువ కార్యకర్త ఇర్ఫాన్‌బాషా, టిడిపి కార్యకర్తలు, ఈర్షద్ అలీ, మున్వర్ అలీ, నౌషద్ అలీ, ఆటో డ్రైవర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కందిపప్పు, నూనె సరఫరా చేయాలి

**ప్రజాశక్తి - వేంపల్లె**

రాష్ట్రంలోని పేద ప్రజలందరికి రేషన్ షాపుల ద్వారా కందిపప్పు, నూనె పంపిణీ చేయాలని పిసిసి అధికార ప్రతినిధి ఎన్. తులసిరెడ్డి కోరారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రేషన్ షాపుల ద్వారా నూనె సరఫరా కావడంలేదన్నారు. ఎనిమిది నెలలుగా రేషన్ షాపుల ద్వారా కందిపప్పు కూడా సరఫరా చేయడం లేదన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పేద ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు నవంబర్ నుంచైనా రేషన్ షాపుల ద్వారా కందిపప్పు, నూనె సరఫరా చేయాలని తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బిసి కార్పొరేషన్ ద్వారా బిసిలకు స్వయం ఉపాధి పనులకు సబ్సిడీతో కూడిన రుణాలు ఇచ్చేందుకు లబ్ధిదారుల ఎంపిక పూర్తయి ఆరు నెలలలైందన్నారు. ఇంతవరకు ఆ పథకం అమలు కాలేదన్నారు. ప్రభుత్వం బిసి కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. బిసి కార్పొరేషన్ బ్యాంకులకు సబ్సిడీ విడుదల చేయకపోవడంతో అవి సబ్సిడీ రుణాలు ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బిసి కార్పొరేషన్ ద్వారా బ్యాంకులకు సబ్సిడీ విడుదల చేసి లబ్ధిదారులకు రుణా లిప్పించాలన్నారు. వాటితో వారు స్వయం ఉపాధి పథకాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆటోడ్రైవర్ల సేవలో పథకం ద్వారా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఒకొక్కరికి ఏడాదికి రూ.15వేలు ఆర్థిక సాయం చేయడం హర్షణీయమన్నారు. కూటమి ప్రభుత్వానికి నిజంగా ఆటోడ్రైవర్ల పట్ల చిత్తశుద్ధి ఉంటే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఆటోల ద్వారా జీవనం సాగించే ప్రతి ఒక్క ఆటోడ్రైవర్‌కు ఈ పథకం వర్తించేలా నియమ నిబంధనలు మార్చాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. జిఎస్‌టి సంస్కరణల ద్వారా 345 వస్తువులు ధరలు తగ్గింపు ఉందని ప్రజలకు మోడీ, చంద్రబాబు ఉదరగొడుతున్నారని, క్షేత్రస్థాయిలో మాత్రం లేదని విమర్శించారు. నిత్యా వసర వస్తువుల ధరలపై మాత్రం తగ్గలేదని తెలిపారు. ధరల తగ్గిం పుపై ప్రచారం తప్ప, ఆచరణ లేదన్నారు. జిఎస్‌టి సంస్కరణ ఫలాలు ప్రజలకు అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూడాలని కోరారు. విలేకరుల సమా వేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్ గౌడ్, విద్యార్థి విభా గం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, పూల నజీర్, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

పులివెందుల శిల్పారామంలో ఆదివారం సాయంత్రం చిన్నారుల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. దసరా సంబరాల్లో భాగంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో ప్రాంగణమంతా సందడిగా మారింది. డ్యాన్స్ మాస్టర్ భవాని కృష్ణ, భవాని కృష్ణ క్లాసికల్ డాన్స్ పులివెందుల చిన్నారుల ప్రదర్శనలను ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథరెడ్డి, ఫీల్డ్ సూపర్వైజర్ ఇస్మాయిల్, సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## వీధి దీపాల నిర్వహణ..అధికారులకు పట్టదా ?

**ప్రజాశక్తి - ఖాజీపేట**

ప్రభుత్వ ధనాన్ని పొదుపుగా వినియోగించి, వృథాను అరికట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. విద్యుత్ పెద్ద ఎత్తున వృథా అవుతున్నా అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. వీధి దీపాలు పగలు, రాత్రి తేడా లేకుండా నిరంతరాయంగా వెలు గుతూ ఉన్నాయి. వీటిని కట్టడి చేయాల్సిన అధికారులు ఏ మాత్రం పట్టిం చుకోవట్లేదు. వివరాల్లోకి వెళితే.. పూసల కొట్టాల గ్రామంలో విద్యుత్ దీపాలు నిరంతరాయంగా వెలు గుతూ ఉన్నాయి. విద్యుత్తు వృథా వల్ల పంచాయతీలపై ఎనలేని ఆర్థిక భారం పడుతుందని ప్రజాప్రతి నిధులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి విద్యుత్ వృథాను అరికట్టి పొదుపు చర్యలు చేపట్టాలని ప్రజలు, కోరుతున్నారు.

## నేడు గ్రామ సభలు

**ప్రజాశక్తి-చాపాడు**

మండల పరిధిలోని నాలుగు గ్రామాల్లో సోమవారం ఉపాధి హామీ పనుల గుర్తింపునకు గ్రామసభలను ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. అన్నవరం, మడూరు గ్రామాల్లో ఉదయం 10 గంటలకు, నాగులపల్లి, ఖాదర్‌పల్లె గ్రామాల్లో మధ్యాహ్నం మూడు గంటలకు గ్రామ సభలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, స్థానికులు ఆయా గ్రామసభల్లో పాల్గొని ఉపాధి హామీ ద్వారా చేపట్టే పనులపై సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు. **మైదుకూరులో..** మైదుకూరు మండల పరిధిలోని తువ్వపల్లె, నంద్యాలంపేట, మిట్టమానుపల్లె, పప్పనపల్లె, విశ్వనాథపురం గ్రామాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎపిఒ రామచంద్రారెడ్డి తెలిపారు.